# "ఆర్‌ఎస్‌ఎస్ పారదర్శకత" పై కీలక ప్రశ్నలు



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) భారతదేశంలో అత్యంత ప్రభావశీలమైన సామాజిక-సాంస్కృతిక సంస్థగా తనను తాను వర్ణించుకుంటుంది. 1925లో స్థాపించబడిన ఈ సంస్థ శతాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంలోనే కర్ణాటక హోం మంత్రి 'ప్రియాంక ఖర్గే ' ఒక కీలక ప్రశ్నను ముందుకు తెచ్చారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి సంస్థ ప్రభుత్వం వద్ద పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కనుక ఆర్‌ఎస్‌ఎస్ అనే సంస్థ కూడా తన చట్టపరమైన హోదా ఏమిటి ఈ సంస్థకు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ఉందా సంస్థాగత నిర్మాణం ఎలా ఉంది ఈ సంస్థకు సంబంధించిన ఆదాయ వనరులు ఏంత ఉన్నాయి అవి జాతీయంగా, అంతర్జాతీయంగా ఎక్కడ నుండి ఈ సంస్థకు ఏ రూపంలో, ఎందుకు వస్తున్నాయి వాటిని ఏఏ కార్యకలాపాలకు ఎంత మొత్తంలో ఏలా ఖర్చులు పెడుతున్నారు? పన్నులు చెల్లిస్తున్నారా లేదా , ప్రభుత్వం నుంచి అధికారిక రిజిస్ట్రేషన్ ఎందుకు లేదో ప్రజలకు, రాష్ట్ర ప్రభుత్వానికి వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశం దేశవ్యాప్తంగా రాజకీయ, రాజ్యాంగ, ప్రజాస్వామ్య చర్చకు దారితీసింది. ప్రియాంక్ ఖర్గే ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ కు రాసిన లేఖలో, దేశవ్యాప్తంగా 60 వేలకుపైగా శాఖలు, కోట్లాది స్వయంసేవకులు ఉన్నాయని వారే స్వయంగా చెప్పుకునే సంస్థ ప్రజల ముందు పూర్తి పారదర్శకతతో ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు, దేవాలయ ట్రస్టులు, ఎన్‌జీఓలు, కంపెనీలు, సహకార సంఘాలు, కార్మిక సంఘాలు అన్నీ చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ఆడిట్లు నిర్వహించి, తమ ఆర్థిక లావాదేవీలను వెల్లడిస్తుంటే, ఆర్‌ఎస్‌ఎస్‌కు మాత్రం ఈ మినహాయింపు ఎందుకు ఉంది? ఇక ముందు ఎందుకు ఉండాలి? అని ఆయన ప్రశ్నించారు.

ఈ డిమాండ్‌కు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి వాదన ప్రకారం ఆర్‌ఎస్‌ఎస్ ఒక "బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్" (వ్యక్తుల సమూహం) మాత్రమే. ఇది సొసైటీ, ట్రస్ట్ లేదా కంపెనీ కాదు. గతంలో ఆదాయపు పన్ను శాఖ, కొన్ని న్యాయస్థానాలు కూడా ఈ హోదాను గుర్తించాయని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంటోంది. అందువల్ల ప్రత్యేక రిజిస్ట్రేషన్ అవసరం లేదని వారి అభిప్రాయం.

అయితే ఇక్కడే అసలు చర్చ మొదలవుతుంది. ఒక సంస్థ చట్టబద్ధమైనదా కాదా అన్నది మాత్రమే ప్రశ్న కాదు. ప్రజాస్వామ్యంలో అధిక ప్రభావం కలిగిన ఏ సంస్థ అయినా ప్రజలకు జవాబుదారీగా ఉండాలా లేదా అనేదే ప్రధాన ప్రశ్న. అంతకు ముందు బీజేపీ ప్రభుత్వాలు క్రిస్టియన్, ఇస్లామిక్ సంస్థలను, ఎన్.జీ.ఓ.లను కూడా ఇదే చట్టప్రకారం ప్రశ్నించింది. వాటి పై ఆంక్షలు కూడా విధించింది. ఫారిన్ నిధులు డొనేషన్ రూపంలో వచ్చినా...వాటి ఆడిట్ రిపోర్ట్ లు అడిగి, అనేక విదేశీ డొనేషన్లు రాకుండా నిలిపివేసింది. పైగా ప్రతి సంవత్సరం ఈ మత సంస్థలు ప్రభుత్వం నియమించిన ఆడిట్ కమిటీకి లెక్కలు,పత్రాలు, రసీదులు తో సహా రుజువులు చూపించాలని... వాజపేయి ప్రభుత్వం నుంచి అధికారిక ఆర్డర్స్ ఉన్నాయి.

ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, దేశ రాజకీయాలపై, ముఖ్యంగా బీజేపీ విధానాలపై గణనీయమైన ప్రభావం చూపుతుందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. ప్రధానమంత్రి నుంచి అనేక మంది కేంద్ర మంత్రులు వరకు ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం నుంచి వచ్చిన వారే. ఈ పరిస్థితిలో ఆర్‌ఎస్‌ఎస్ పూర్తిగా ప్రైవేట్ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఇది కేవలం కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య రాజకీయ ఘర్షణగా మాత్రమే చూడలేం. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాల్లో పెద్ద సామాజిక, మత, రాజకీయ ప్రభావం కలిగిన సంస్థలపై పారదర్శకత ప్రమాణాలు క్రమంగా పెరుగుతున్నాయి. నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి వాటిని ఎలా ఖర్చు చేస్తున్నారు? విదేశీ నిధులు ఉన్నాయా ఆస్తులు ఎంత ఉన్నాయి? వంటి ప్రశ్నలు ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైనవే.మరోవైపు, కాంగ్రెస్ నేతలు ఈ అంశాన్ని చాలాకాలంగా లేవనెత్తుతున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రిజిస్ట్రేషన్ లేని సంస్థగా పనిచేస్తోందని, భారీ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పటికీ ఆర్థిక వివరాలు బహిరంగంగా అందుబాటులో లేవని వారు ఆరోపిస్తున్నారు. కర్నాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే కూడా ఇదే వాదనను పునరుద్ఘాటించారు.

అయితే ఈ వివాదంలో కాంగ్రెస్ వైఖరిపైనా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ దాదాపు శతాబ్ద కాలంగా పనిచేస్తోంది. కాంగ్రెస్ ఎన్నో సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉంది. అప్పట్లో ఈ ప్రశ్నలను ఎందుకు గట్టిగా ముందుకు తేలేదనే విమర్శ కూడా వినిపిస్తోంది. ఇప్పుడు రాజకీయ అవసరాల కోసమే ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నారా అనే అనుమానాలు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వర్గాల నుంచి వస్తున్నాయి. మిగతా క్రైస్తవ మత సంస్థలకూ, ఇస్లామిక్ సంస్థలకు కూడా దాదాపుగా ఆరెస్సెస్ కు ఉన్న చరిత్రే ఉంది.ఆ సంస్థలు ఇప్పుడు పుట్టినవి కావు. గతంలో అడగక పోతే ఇప్పుడు కూడా లెక్కలు అడగ కూడదా? చట్టం ముందు ఈ పక్షపాతం ఏలా చెల్లుతుందిఈ వివాదం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా గుర్తు చేస్తోంది. భారతదేశంలో అనేక మత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ప్రభావం కలిగిన సంస్థలు ఉన్నాయి. పారదర్శకత ప్రమాణాలు ఒక సంస్థకు మాత్రమే కాకుండా అందరికీ సమానంగా వర్తించాలి. ఒకవేళ ఆర్‌ఎస్‌ఎస్ తన ఆర్థిక, సంస్థాగత వివరాలను వెల్లడించాల్సి వస్తే, అదే ప్రమాణం ఇతర మత సంస్థలు, రాజకీయ అనుబంధ సంస్థలు, పెద్ద ఎన్‌జీఓలు, ట్రస్టులకూ వర్తించాలి. లేకపోతే అది రాజకీయ లక్ష్యంతో చేసిన పక్షపాత చర్యగా కనిపించే ప్రమాదం ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో చట్టం ముందు అందరూ సమానమని రాజ్యాంగం చెబుతుంది. అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు కూడా రాజ్యాంగం కల్పించింది. కాబట్టి ఈ రెండు సూత్రాల మధ్య సమతుల్యత అవసరం. పారదర్శకత కోరడం ప్రజాస్వామ్య హక్కు. కానీ దాన్ని రాజకీయ ప్రతీకార సాధనంగా ఉపయోగించరాదు. అలాగే పారదర్శకత కోరుతున్న ప్రశ్నలను దేశద్రోహం, దాడి లేదా కుట్రగా చిత్రీకరించడం కూడా సమంజసం కాదు.ఈ వివాదానికి ఉత్తమ పరిష్కారం స్పష్టత. ఆర్‌ఎస్‌ఎస్ తన చట్టపరమైన హోదా, నిధుల వనరులు, ఆడిట్ విధానం, పన్ను సంబంధిత అంశాలపై అధికారిక వివరాలు బహిరంగంగా వెల్లడిస్తే అనేక సందేహాలకు తెరపడుతుంది. అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని పెద్ద సంస్థలకు ఒకే విధమైన పారదర్శకత ప్రమాణాలను అమలు చేయాలి.

ప్రజాస్వామ్యంలో విశ్వాసం రహస్యాల వల్ల కాదు, జవాబుదారీతనం వల్ల పెరుగుతుంది. ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రియాంక్ ఖర్గే లేవనెత్తిన ప్రశ్నలు రాజకీయంగా వివాదాస్పదమైనవైనా, పారదర్శకత, జవాబుదారీతనం, చట్టబద్ధత వంటి మౌలిక అంశాలపై దేశవ్యాప్తంగా ఒక అవసరమైన చర్చకు మాత్రం నాంది పలికాయి.

**సూచనలు:**

ఆర్‌ఎస్‌ఎస్ సహా అన్ని పెద్ద సామాజిక, మత, రాజకీయ ప్రభావం కలిగిన సంస్థలకు ఒకే విధమైన పారదర్శకత చట్టం తీసుకురావాలి.వార్షిక ఆడిట్ నివేదికలు, నిధుల వనరులు, ప్రధాన ఆస్తుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి.రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా ఈ అంశాన్ని పరిష్కరించాలి.పారదర్శకత ప్రమాణాలు అన్ని సంస్థలకు సమానంగా ఒకే ప్రమాణాలతో వర్తిస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు భద్రతకు అత్యంత కీలకం





**మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**

**మిడ్జిల్, జూన్ 18 (జర్నలిస్ట్ డైరీ)**
మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓం కన్వెన్షన్ హాల్‌లో గురువారం మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యాపారవేత్తలకు సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యాపార సంస్థ, షాపింగ్ కాంప్లెక్స్, గోదాం మరియు వాణిజ్య సముదాయాలలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరంగా మారిందని తెలిపారు.
సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణలో, నేరస్తులను గుర్తించడంలో, అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ వివరించారు. వ్యాపార సంస్థల్లో నాణ్యమైన కెమెరాలు, సరైన స్టోరేజ్ సామర్థ్యంతో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వ్యాపారవేత్తలు తమ సీసీటీవీ వ్యవస్థలను మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయవచ్చని తెలిపారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో కూడా అనుసంధానం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వ్యాపారవేత్తలు తమ సంస్థల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. నగదు లావాదేవీలు జరిగే ప్రదేశాలు, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి ముఖ్య ప్రదేశాల్లో తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్తలు సీసీటీవీ అనుసంధానం, సాంకేతిక సదుపాయాలపై తమ అభిప్రాయాలు, సూచనలు జిల్లా ఎస్పీ కి తెలియజేశారు. పోలీస్ శాఖ చేపడుతున్న ఈ భద్రతా చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, మహబూబ్‌నగర్ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ మరియు పెద్ద ఎత్తున వ్యాపారవేత్తలు, సంస్థల యజమానులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికై టీటీడీ చైర్మన్ను కలిసిన వెలిచాల



**కరీంనగర్, జూన్ 18 (జర్నలిస్ట్ డైరీ)**
కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడుతో హైదరాబాదులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు ఆలయాన్ని ఉత్తర తెలంగాణ భక్తులకు సౌకర్యవంతంగా, దేదీప్యమానంగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణ అభివృద్ధి, పార్కింగ్ సదుపాయాలు, పరిశుభ్రత, తాగునీటి వసతి, దర్శన ఏర్పాట్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, పరిసరాల సుందరీకరణ వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఆలయ నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ కృషి చేస్తుందని తెలిపారు.కరీంనగర్ టీటీడీ ఆలయం ఆధ్యాత్మికతకు ప్రధాన కేంద్రంగా నిలుస్తుందని, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిర్మాణం చేపడతామని రాజేందర్‌రావు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన బి.ఆర్. నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఉత్తర తెలంగాణ భక్తులకు చేరువగా కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది.

# పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి: జిల్లా కలెక్టర్



**ఉమ్మడి వరంగల్ జూన్ 18 (జర్నలిస్ట్ డైరీ)**
పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లోచైతన్యంతీసుకురావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. హన్మకొండ ఎక్సైజ్ కాలనీ రైతు బజార్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు జి డబ్ల్యూ ఎం సి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జూట్, క్లాత్, బయో డి గ్రేడబుల్ బ్యాగుల ప్రత్యేక స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణహిత బ్యాగులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం



**ఉమ్మడి వరంగల్, జూన్ 18 (జర్నలిస్ట్ డైరీ)**
అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. వరంగల్ జి డబ్ల్యూ ఎం సి ప్రధాన ప్రత్యేక సమగ్ర ఓటు జాబితా సవరణ సర్ కార్యక్రమంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ నమోదు, మార్పులు, తొలగింపు ప్రక్రియలో రాజకీయ పార్టీలు ,బిఎల్ఏలు ,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు ,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

